18 వార్డులను సమాన దృష్టితో చూస్తా

- కలిసికట్టుగా పనిచేస్తాం
- నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్


చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లుగా పదవీ బాధ్యతలు తీసుకున్న నాగపూర్ణశ్రీనివాస్, విజయ్‌బాబులు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని 18 వార్డులను సమాన దృష్టితో చూసి వాటి అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా కృషి చేస్తామని శుక్రవారం చైర్‌పర్సన్‌గా ఎన్నికైన మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం రాజేంద్రనగర్ ఆర్డీఓ వెంకట్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆమెను 13 మంది కౌన్సిలర్‌లు ఏకగ్రీవంగా చైర్‌పర్సన్‌గా, 3వ వార్డు కోకాపేట కౌన్సిలర్ గోపాల విజయ్‌బాబును వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. అనంతరం వారితో ఆర్డీఓ పదవీప్రమాణ స్వీకారం చేయించగా, రాష్ట్ర పాడిపరిశ్రమాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ బి.జ్ఞానేశ్వర్, రాష్ట్ర మైనార్టీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఫహీం ఖురేషి, పీసీసీ అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డిలు వారిని సీట్లలో కూర్చోబెట్టారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ నార్సింగి మున్సిపాలిటీలో అన్ని రకాల వనరులతో పాటు ప్రజలకు అదేస్థాయిలో సమస్యలు ఉన్నాయన్నారు. వాటి పరిష్కారానికి తమ వంతు పూర్తి స్థాయిలో కృషి చేస్తామన్నారు. తమకు పదవులు వచ్చేలా కృషి చేసిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కౌన్సిలర్‌లకు వారు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కొత్తగా పదవులు పొందిన ఇద్దరినీ ఘనంగా సన్మానించారు.

సంయుక్త సన్మానం...

రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్, నార్సింగి మున్సిపాలిటీలను కాంగ్రెస్ వశం చేసేందుకు ఎత్తులకు పైఎత్తులు వేసి కృషి చేసిన బి.జ్ఞానేశ్వర్, ముంగిజైపాల్ రెడ్డి, నార్సింగి మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్‌లను పార్టీ నాయకులు సంయుక్తంగా సన్మానించారు. వారి కృషితోనే రెండు మున్సిపాలిటీలలో కాంగ్రెస్ జెండా ఎగిరిందని, రాబోయే రోజుల్లో శంషాబాద్ టార్గెట్‌గా వారు పనిచేయాలని కోరారు. నూతన చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లుగా పదవీ బాధ్యతలు తీసుకున్న వారిని చేవెళ్ల ఎంపీ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి అభినందించారు.

కొత్త పదవీ...కొత్త కారు

నార్సింగి మున్సిపాలిటీ నూతన చైర్‌పర్సన్‌గా ఎన్నికైన నాగపూర్ణశ్రీనివాస్ శుక్రవారం చైర్‌పర్సన్ పదవితో పాటు ఫార్చ్యూనర్ వాహనాన్ని ఎక్కారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపడుతున్న సమయంలోనే మున్సిపల్ కార్యాలయం ముందు కొత్త వారు వచ్చి ఆగింది. దాన్ని బి.జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, ముంగి జైపాల్‌రెడ్డి, అశోక్‌యాదవ్‌ల చేతుల మీదుగా ప్రారంభింపచేసి దాన్ని అందుకున్నారు. కౌన్సిలర్ నుంచి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పదవితో పాటు కొత్త ఫార్చ్యూనర్ వాహనం రావటం ఆనందంగా ఉందన్నారు.


నూతన చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు


జ్ఞానేశ్వర్, జైపాల్‌రెడ్డి, అశోక్‌యాదవ్‌లను సన్మానిస్తున్న నాయకులు

నార్సింగి మున్సిపాలిటీ హస్తగతం

- నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ వశం
- చైర్‌పర్సన్‌గా నాగపూర్ణ శ్రీనివాస్, వైస్ చైర్మన్‌గా విజయ్‌బాబు
- ప్రశాంతంగా జరిగిన ఎన్నిక ప్రక్రియ
- చైర్‌పర్సన్, చైర్మన్లను అభినందించిన గడ్డం రంజిత్‌రెడ్డి


నూతన చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లను అభినందిస్తున్న రంజిత్‌రెడ్డి తదితరులు

మణికొండ: రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ వశం అయ్యింది. ఇప్పటికే బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ కోటాలో చేరగా శుక్రవారం జరిగిన నార్సింగి మున్సిపాలిటీ అదే బాటలో కాంగ్రెస్ ఖాతాలో చేరింది. నార్సింగి మున్సిపాలిటీలో గతంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండగా ముగ్గురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరటం, ఓ స్వతంత్ర కౌన్సిలర్, ఇద్దరు బీజేపీ కౌన్సిలర్‌లు మద్దతు తెలపటంతో ఈనెల 18వ తేదీన 18 మంది సభ్యులకు గాను 14 మంది సభ్యుల బలంతో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లపై పెట్టిన అవిశ్వాసం నెగ్గటంతో వారు పదవీచ్యుతులు అయ్యారు. కొత్త చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకునేందుకు జిల్లా కలెక్టర్ శుక్రవారం తేదీ నిర్ణయించారు. దీంతో ముందు నుంచి అనుకున్నట్టుగానే నార్సింగి మున్సిపాలిటీ కొత్త చైర్‌పర్సన్‌గా మంచిరేవుల 10వ వార్డు కౌన్సిలర్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, కోకాపేట 3వ వార్డు కౌన్సిలర్ గోపాల విజయ్‌బాబును వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఉదయం 11గంటలకు మున్సిపల్ కార్యాలయంలో రాజేంద్రనగర్ ఆర్డీఓ వెంకట్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఎన్నిక సజావుగా సాగింది. అనంతరం 12.20 గంటలకు వారితో ప్రమాణస్వీకారం చేయించి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఫహీం ఖురేషి, రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ బి.జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, పీసీసీ అధికారి ప్రతినిధి ముంగిజైపాల్ రెడ్డి, నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్‌లు వారిని అభినందించి వారి సీట్లలో కూర్చోపెట్టారు.

భక్తిశ్రద్ధలతో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు


స్వామి వారిని చక్రస్నానానికి తీసుకెళ్తున్న ఆలయ అర్చకులు

మైలార్‌దేవ్‌పల్లి: టీఎన్జీవోస్ కాలనీలోని వేంకటేశ్వర ఆలయం సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం చివరి రోజు ఆలయ కమిటీ వారు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారికి భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి ఆలయ అర్చకులు జనార్ధనాచార్యులు, శ్రీమన్నారాయణచార్యులు చక్రస్నానం జరిపించారు. అనంతరం దంపతులచే మహా పూర్ణాహూతి కార్యక్రమం నిర్వహించారు. స్వామివారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం ఆలయం ప్రాంగణంలో ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఫర్టిలైజర్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు


కవేలిగూడ చౌరస్తాలో ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

శంషాబాద్ రూరల్: మండలంలోని కవేలి గూడ చౌరస్తాలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో వ్యవసాయాధికారులు, పోలీసులు శుక్రవారం సంయుక్త ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లో ఉన్న స్టాకు, అమ్మకానికి పెట్టిన విత్తనాలు, మందులను తనిఖీ చేశారు. నకిలీ లేదా అనుమతి లేని విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు ఉంటాయని అధికారులు హెచ్చరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టినట్లు ఏఓ కవిత తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

శంషాబాద్‌లో క్యాబ్ డ్రైవర్ హల్‌చల్

ట్రాఫిక్ పోలీసులతో వాగ్వాదం


పోలీసులతో వాగ్వాదానికి పాల్పడుతున్న యువకుడు

శంషాబాద్: కారును రోడ్డుపై అడ్డంగా పెట్టడమే కాకుండా ట్రాఫిక్ పోలీసులతో క్యాబ్ డ్రైవర్ వాగ్వాదానికి దిగిన సంఘటన శంషాబాద్ పట్టణంలో శుక్రవారం చోటుచేసుకుంది. పట్టణంలో కరాచిబేకరి ముందు శుక్రవారం మధ్యాహ్నం ఓ క్యాబ్‌డ్రైవర్ రోడ్డుపై క్యాబ్‌ను నిలపడంతో ట్రాఫిక్ పోలీసులు అతడిని కారు అక్కడి నుంచి తీయాల్సిందిగా సూచించారు. కారు తీయకపోవడంతో పాటు ట్రాఫిక్ పోలీసులతో వాగ్వాదానికి దిగడంతోపాటు మరో పోలీసుపై దాడికి యత్నించాడు. దీంతో కొన్ని నిమిషాల పాటు రహదారిపై ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. క్యాబ్ డ్రైవర్ వివరాలు తీసుకుని అతడిపై ఆర్‌జీఐఏ పోలీసులకు ట్రాఫిక్ పోలీసుల ఫిర్యాదు మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఇంకుడు గుంతలపై అవగాహన

మణికొండ: వర్షాకాలంలో నీటిని ఒడిసి పట్టుకుని, ఇంకుడు గుంతల ద్వారా భూగర్భ జలాలను పెంచుకోవటంపై శనివారం మణికొండ మున్సిపాలిటీ, అలకాపూర్ టౌన్‌షిప్, రోడ్డు నెంబర్ 25లో జలమండలి అధికారులు అవగాహన సదస్సును నిర్వహిస్తున్నారని అలకాపూర్ టౌన్‌షిప్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వంశీ తెలిపారు. ఉదయం 10.30గంటలకు క్లబ్ హౌస్‌లో జరిగే ఈ కార్యక్రమానికి జలమండలి అధికారులు హాజరవుతారని, టౌన్‌షిప్ వాసులు పెద్ద ఎత్తున హాజరై రాబోయే వర్షాకాలంలో నీటిని భూమిలోకి ఇంకే చర్యలు చేపట్టాలన్నారు.

సహకార సంస్థలను బలోపేతం చేయాలి

రాజేంద్రనగర్: సహకార సంస్థల్లో సభ్యుల భాగస్వామ్యాన్ని సంస్థల ఆర్థిక బలోపేతం కావడానికి అవసరమైన శిక్షణ కార్యక్రమాలు, కాలానుగుణంగా అందుబాటులో ఉన్న సాంకేతికతను ఉపయోగించుకోవాలని తెలంగాణ ప్రభుత్వ కో–ఆపరేటివ్ సొసైటీస్ అడిషనల్ రిజిస్ట్రార్ జి.శ్రీనివాస్‌రావు అన్నారు. రాజేంద్రనగర్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ కో–ఆపరేటివ్ మేనేజ్‌మెంట్‌లో శుక్రవారం ప్రోగ్రామ్ అడ్వయిజరీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రంలో సహకార సంస్థల ఆర్థిక బలోపేతానికి అవసరమైన శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. జవాబుదారితనం పారదర్శకత సహకార స్ఫూర్తి కలిగిన అంశాలు మాత్రమే సహకార రంగం బలోపేతానికి దోహదపడుతాయన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని సహకార సంఘాలు భారత ప్రభుత్వం ద్వారా అందజేసే, అమలవుతున్న పథకాల ద్వారా ఆర్థిక వనరులను పెంపొందించుకోవాలన్నారు. పూర్తి కంప్యూటరీకరణ జరగాలని తద్వారా సభ్యులకు పారదర్శకతతో కూడిన సేవలు అందించడం సులభమవుతుందన్నారు. నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ ముఖ్య కార్య నిర్వాహక అధికారి డాక్టర్ బి.కె.బెహారా మాట్లాడుతూ ప్రభుత్వం సహకారంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో మత్స్య సహకార సంఘాల అభివృద్ధికి అవసరమైన శిక్షణ కార్యక్రమాలు, నూతన కార్మిక సహకార సంఘాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.ఎల్.ఎస్.టి.శ్రీనివాస్, నాబార్డ్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల అధికారులు, ఇఫ్కో అధికారులు, మహేష్ కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్, తెలంగాణ రాష్ట్ర హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్ డిపార్ట్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు. డాక్టర్ గణేశన్ డైరెక్టర్ మెంబర్ కన్వీనర్‌గా సంస్థ చేపట్టిన కార్యక్రమాలు ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.


సమావేశంలో పాల్గొన్న అడిషనల్ రిజిస్ట్రార్ జి.శ్రీనివాస్ రావు

పొగాకు వినియోగంతో జీవితాలు నాశనం

ఉద్యాన కళాశాలలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం


శ్రీకొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం పోస్టర్‌ను డ్రాయింగ్ వేస్తున్న విద్యార్థులు

ఏజీవర్సిటీ: పొగాకు వినియోగాలతో ఎంతో భవిష్యత్ ఉన్న జీవితాలు నాశనం అవుతున్నాయని కళాశాల డీన్ డాక్టర్ ప్రశాంత్ అన్నారు. రాజేంద్రనగర్‌లోని శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో శుక్రవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు విశ్వవిద్యాలయంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీన్ డాక్టర్ ప్రశాంత్ పొగాకు వాడడం వలన కలిగే నష్టాలను ఎదురయ్యే అనర్థాలను పొగాకును పూర్తిగా నిర్మూలించుటకు తీసుకోవల్సిన అంశాలను విద్యార్థులకు వివరించారు. పొగాకు వినియోగంతో వలన హృదయ, శ్వాసకోశ వ్యాధులు, క్యాన్సర్ వంటి వ్యాధులతో పాటు ఇతర వ్యాధులు వస్తాయని అన్నారు. విద్యార్థులకు పొగాకు వ్యతిరేక దినోత్సవం అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, పోస్టర్ తయారీ నాటికల పోటీలను నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఇంచార్జులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

కాటేదాన్ ఆయిల్ మిల్లుల్లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

మైలార్‌దేవ్‌పల్లి: నిబంధనలకు విరుద్ధంగా పరిశ్రమలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని కాటేదాన్ పారిశ్రామికవాడలోని భాగ్యనగర్ ఆయిల్ రిఫనరీస్, కేడియా అగ్రో, అంబికా ఆయిల్ ఇండస్ట్రీస్‌లలో శుక్రవారం టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఆయా పరిశ్రమలలో అపరిశుభ్రంగా ఉండడమే కాకుండా ఎలాంటి అనుమతులు లేకుండానే పరిశ్రమలు నడిపిస్తున్నట్లు గుర్తించామన్నారు. మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్, రికార్డులు లేకుండానే పరిశ్రమలు నడిపిస్తున్నట్లు తెలుసుకున్నామన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన పరిశ్రమ నిర్వాహకులకు నోటీసులు జారీ చేసి తగిన చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు.

విలువలతో కూడిన విద్యతోనే మంచి సమాజం


మాట్లాడుతున్న డాక్టర్ రాధికారెడ్డి


శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు

బండ్లగూడ: ఎప్పుడైతే విలువలతో కూడిన విద్య అందుతుందో అక్కడ మంచి సమాజం ఏర్పడుతుందని దానికి సరస్వతీ శిశుమందిరాలు ఎంతో కృషి చేస్తున్నాయని ప్రముఖ దంత వైద్య నిపుణులు డాక్టర్ రాధికారెడ్డి అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ శారదాధామంలో తెలంగాణ రాష్ట్ర స్థాయి శిశు మందిర నూతన ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిశు మందిరాలు ఉపాధ్యాయ శిక్షణలో, విలువలలో కూడిన శిక్షణను ఇస్తున్నాయన్నారు. సమాజ నిర్మాణాత్మకంగా ఉండాలంటే తరగతి గదిలో బోధన చేసే ఉపాధ్యాయుని ద్వారానే చక్కటి పౌరులుగా, సమాజ గురించి ఆలోచించేవారుగా నిర్మాణం అవుతారన్నారు. సమగ్రంగా ఆలోచించే ఉపాధ్యాయుల ద్వారానే ఇది సాధ్యమవుతుందన్నారు. ఉపాధ్యాయుడు అన్ని విషయాలలో నైపుణ్యం సాధించాలన్నారు. ఆ నైపుణ్యానికి సృజనాత్మకతను జోడించి తరగతి గదిలోని విద్యార్థులకు బోధించాలన్నారు. బోధనలోనే సృజనాత్మకతను ఎలా అన్వయించాలో విద్యార్థులకు తెలియజేయాలన్నారు. ప్రపంచమంతా యోగాను కోరుకుంటుందని యోగా శిక్షణను కూడా శిశుమందిర ఉపాధ్యాయులకు ఇవ్వడం చాలా అద్భుతమైన విషయమన్నారు. ఉపాధ్యాయుల శిక్షణలో సమాజపు విలువలను జోడించడం, తాము చేస్తున్న పని సమాజం, దేశం కోసం సేవ చేయాలన్న భావన ఉపాధ్యాయులలో నిర్మాణం చేయడం అద్భుతమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సరస్వతీ విద్యా పీఠం ప్రాంత సంఘటనా కార్యదర్శి పతకమూరి శ్రీనివాస్‌రావు, ప్రాంత కార్యదర్శి ముక్కాల సీతారాములు, ప్రాంత శైక్షణిక ప్రముఖ్ కృష్ణమాచార్యులు, భాగ్యనగర్ విభాగ్ సేవా ప్రముఖ్ భల్లా మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు పని ప్రదేశాల్లో కనీస వసతులు కల్పించాలి


సమావేశంలో పాల్గొన్న నాయకులు

రాజేంద్రనగర్: కార్మికులు పనిచేసే ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని సీఐటీయు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు జాజాల రుద్ర కుమార్ కోరారు. రాజేంద్రనగర్ మండలం తెలంగాణ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపాలిటీ కార్మికుల నూతన కమిటీ ఎన్నిక కాటేదాన్ డంపింగ్ యార్డ్ పర్మినెంట్ డ్రైవర్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయు ఆధ్వర్యంలో కాటేదాన్ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మోహన్ బాలకృష్ణ, అధ్యక్షులుగా బి.శ్రీరాములు, ఉపాధ్యక్షులుగా ఓబులేష్ రాజు, కార్యదర్శిగా జై శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా బాలకృష్ణ, శంకర్, కోశాధికారిగా అజీజ్, జి.మల్లేష్, కార్యవర్గ సభ్యులుగా ఉత్తం నాగరాజు, సైదులు, నరసింహా, జె.రాజు, టి.నర్సింహులు, కె.ఆంజనేయులు, సునీల్‌లు ఎన్నికయ్యారు. అనంతరం జాజాల రుద్రకుమార్ మాట్లాడుతూ హెచ్ఐఎంఎస్‌డబ్ల్యూ సంస్థలో పని చేస్తున్న కార్మికులందరూ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు హెవీ వెహికిల్స్, మినీ వెహికిల్స్ డ్రైవర్స్, హెల్పర్స్‌గా పని చేస్తూ విధులు నిర్వహిస్తున్నారన్నారు. వీరందరికి కనీసం భోజనం చేసే సమయంలో క్యాంటీన్ వసతి, బాత్‌రూమ్స్, రెస్ట్‌రూమ్స్, లంచ్ రూమ్స్, సంస్థలో పనిచేస్తున్న కార్మికులందరికి ఐటీ కార్డులు, సేఫ్టీ పరికరాలు, ఇన్సూరెన్స్ తదితర సమస్యలపై సతమవుతున్నారన్నారు. 8 గంటల పనిదినం అమలు చేయకుండా అదనంగా ట్రిప్పులు వేయిస్తూ 10 గంటల వరకు పని చేయించుకుంటూ రెండు గంటల పనికి ఓటీ కట్టించకుండా శ్రమ దోపిడీ గురి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.రామ్మోహన్‌రావు, రంగారెడ్డి జిల్లా నాయకులు రాజేంద్రనగర్ మండల సీనియర్ నాయకులు జి.కురుమన్న, బి.స్వామిలు, పర్మినెంట్ డ్రైవర్స్, హెల్పర్స్ తదితరులు పాల్గొన్నారు.

మంచి అలవాట్లతోనే ఆరోగ్యకర జీవనం

ఆరాంఘర్ చౌరస్తాలో ప్రపంచ పొగాకు నియంత్రణ దినోత్సవ ర్యాలీ


ర్యాలీలో జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వర్‌రావు

రాజేంద్రనగర్: యువత మంచి అలవాట్లు చేసుకోవటంతో ఆరోగ్యకర జీవనం కలుగుతుందని చెడు అలవాట్లు చేసుకుంటే జీవితాలు నాశనం అవుతాయని జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. ప్రపంచ పొగాకు నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం రాజేంద్రనగర్ సర్కిల్ ఆరాంఘర్ చౌరస్తాలో జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వర్ రావు ఆధ్వర్యంలో పొగాకు విరమణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిగరెట్టు, ఇతర పొగాకు ఉత్పత్తుల వినియోగంతో కలిగే దుష్ప్రభావాలపై డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వర్‌రావు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ 1987లో ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవం ఏర్పాటు చేసి పొగాకుతో సంభవించే వ్యాధులపై వివరించడం జరిగిందన్నారు. పొగాకు తీసుకోవడంతో వాటిలో ఉండే రసాయనాలతో మెదడు, గుండె, ఊపిరితిత్తులు, రక్త ప్రసరణ తగ్గుతుందన్నారు. దీంతో పాటు నరాల బలహీనత కలుగచేస్తుందన్నారు. ప్రజలు మంచి ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు రాకేశ్, రేఖ, వందన, ఫిరోజుద్దీన్, స్వాతి, చేతన్, సంగీత, సిహెచ్ఓ సిరాజుద్దీన్, హెచ్ఈఓ కేశవ్, హెచ్ఎస్ శివ కుమార్, సురేశ్, వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ సహకారంతో వ్యాపారవేత్తలుగా ఎదగాలి


మహిళలకు న్యూట్రిషన్ ఫుడ్ తయారీ విధానాన్ని చూపిస్తున్న అధికారులు

ఏజీవర్సిటీ: ప్రభుత్వ సహకారాలను సద్వినియోగం చేసుకొని మహిళలు మంచి వ్యాపారవేత్తలుగా ఎదగాలని కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్ అసోసియేట్ డీన్ డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని కాలేజీ ఆఫ్ కమ్యూనిటీ సెన్స్ ఫుడ్ అండ్ న్యూట్రిషన్ విభాగం ద్వారా ఎస్సీ సబ్‌ప్లాన్ కింద మహిళలకు న్యూట్రిషన్ ఫుడ్ ఎలా తయారు చేయాలనే విషయంతో ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఇందులో కార్వాన్‌లోని జాపర్‌గూడ్, ఎల్‌బీనగర్‌లోని అల్వాపూరికు చెందిన 40 మంది మహిళలకు ఇందులో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విజయలక్ష్మి మాట్లాడుతూ వ్యాపారవేత్తలుగా ఎదగటానికి అవకాశాలు వచ్చినప్పుడు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానం, మార్గదర్శకత్వం, మద్దతును అందించడానికి విశ్వవిద్యాలయం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందని అన్నారు. మహిళలు వ్యాపారవేత్తలుగా మారడానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ మహిళా అభివృద్ధి సొసైటీ అర్బన్ న్యూట్రిషన్ ప్రాజెక్ట్ మేనేజర్ ఎల్. భవాని మాట్లాడుతూ మహిళలు రోజువారి జీవితంలో పోషకాహారం, పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్యం ఆవశ్యకతపై సూచించారు. ఈ కార్యక్రమంలో ఇ జాహ్నవి, టి. సుప్రజ, ఎం. సూజాత, ఎస్. సుచరిత, ఎం. స్వప్న తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణలో నిర్లక్ష్యం చేయొద్దు

అధికారులు, సిబ్బందికి కమిషనర్ బి. శరత్‌చంద్ర సూచనలు


చెత్త సేకరణ కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్ బి.శరత్‌చంద్ర

బండ్లగూడ: ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించడంలో ఆటోడ్రైవర్లు వారి సహాయకులు నిర్లక్ష్యం చేస్తే ఊరుకునేది లేదని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర హెచ్చరించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా శానిటేషన్ పనులు నిర్వహించాలని ఆయన సూచించారు. శుక్రవారం ఉదయం మారుతీనగర్, రాఘవకాలనీ, సాయిరాం ఎన్‌క్లేవ్ తదితర ప్రాంతాల్లో శానిటేషన్ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులు, సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ వందశాతం చెత్త సేకరణ జరగాలన్నారు. సాట్ ఆటో డ్రైవర్లు, సహాయకులు విధిగా ప్రతి రోజు ఇంటింటికి వెళ్లి చెత్తను తీసుకోవాలన్నారు. కార్మికులు విధులు నిర్వహించే సమయంలో జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలన్నారు. గ్లౌజ్, మాస్క్ తదితర వాటిని ధరించాలన్నారు. డ్రైనేజీ పనులను ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నామన్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని డ్రైనేజీలోని సిల్ట్ మొత్తం తొలగించాలని జవాన్లను ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, కాలనీ వాసులు జె.సహదేవ్, బి.ఎల్లప్ప, రాయుడు, బిల్ కలెక్టర్ చంద్రశేఖర్, శానిటరీ జవాన్లు మల్లేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతులు



పాడైన డ్రైనేజీ మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేయిస్తున్న కార్పొరేటర్ గోకరి సురేష్‌గౌడ్

బండ్లగూడ: ప్రమాదకరంగా ఉన్న డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతులు చేపట్టాలని ప్రచురించిన కథనానికి కార్పొరేటర్ గోకరి సురేష్‌గౌడ్ స్పందించారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ ఎక్సైజ్ అకాడమీ నుంచి కిస్మత్‌పూర్ వివేకానంద విగ్రహం వరకు ఉన్న రోడ్డు ప్రమాదకరంగా ఉందని శుక్రవారం సాక్షి దినపత్రికలో 'ఆదమరిస్తే' అంతే అనే శీర్షికకు 18వ డివిజన్ కార్పొరేటర్ ప్రతినిధి గోకరి సురేష్‌గౌడ్ స్పందించి మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వాహనాల రాకపోకల కారణంగా డ్రైనేజీ మ్యాన్‌హోల్ శిథిలావస్థకు చేరుతున్నాయన్నారు. ఎప్పటికప్పుడు సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. త్వరలోనే బీటీ రోడ్డు కూడా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.